## క్లుప్తంగా

### నందిహిల్స్ అభివృద్ధికి కృషి



కాజీపేట అర్బన్: 31వ డివిజన్ పరిధిలోని నందిహిల్స్ అభివృద్ధికి కృషి చేస్తానని పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి తెలిపారు. నందిహిల్స్ కాలనీలో ఎమ్మెల్యే ఆదివారం పర్యటించి కాలనీ వాసులు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అంతర్గత రోడ్లు అధ్వానంగా మారాయని, డ్రెయినేజీ వ్యవస్థ సరిగా లేదని, వర్షాకాలంలో జులైవాడ నుంచి వర్షపు నీరు నందిహిల్స్ కాలనీలోకి వచ్చి చేరుతోందని ప్రజలు తెలిపారు. ఈక్రమంలో అధికారులు కాలనీలో పర్యటించి ప్రజల సమస్యలను పరిష్కరించాలని వారికి ఎమ్మెల్యే ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మామిండ్ల రాజు, మాజీ కార్పొరేటర్ మాధవి, మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

### కేయూలో ఇద్దరికి డాక్టరేట్





కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో ఇద్దరు పరిశోధకులకు యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. బయోటెక్నాలజీ విభాగం పరిశోధకురాలు అనుముల వైష్ణవికి డాక్టరేట్ ప్రకటించారు. ట్రాన్స్‌ఫర్మేషన్ ఆఫ్ విజుబుల్ రిపోర్టర్ జీన్ రూబీ అండ్ ఎడిటింగ్ ఆఫ్ ఎస్ఎంఎంఎల్ -1 జీన్ థ్రో క్రిస్పర్ క్యాస్ 9 టెక్నాలజీ ఇన్ సొలానం మెలోగ్నేనా ఎల్‌సీవీ గ్రీన్ రౌండ్ అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి వైష్ణవికి డాక్టరేట్ ప్రదానం చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ నర్సింహాచారి తెలిపారు. ఆ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ వెంకటేశ్వర్‌రావు పర్యవేక్షణలో వైష్ణవి తన పీహెచ్‌డీ పూర్తిచేశారు. అలాగే, కాకతీయ యూనివర్సిటీ బయో కెమిస్ట్రీ విభాగం పరిశోధకుడు పరాంకుశం శ్రీనివాస్‌కు యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. పూరిఫికేషన్ అండ్ క్యారెక్టరైజేషన్ ఆఫ్ రిబోఫ్లేవిన్ బైండింగ్ ప్రొటీన్ ఫ్రమ్ ఎగ్ వైట్ అండ్ ఎగ్ - యాక్ట్ ఆఫ్ కామన్ క్రేన్ అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి శ్రీనివాస్‌కు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ నర్సింహాచారి తెలిపారు. ఆ విభాగం రిటైర్డ్ ప్రొఫెసర్ మధుకర్ పర్యవేక్షణలో శ్రీనివాస్ తన పీహెచ్‌డీ పూర్తిచేశారు.

### సమస్యను పరిష్కరించారు

హసన్‌పర్తి: హసన్‌పర్తి మండలం సిద్ధాపురంలో నీటి సమస్య నివారణకు స్థానిక ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు సత్వరమే స్పందించారు. ఈమేరకు సమస్య పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకున్నారు. సిద్ధాపురంలో నీటి సమస్య తీవ్రంగా ఉందని ఎమ్మెల్యేకు స్థానికులు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. వెంటనే ఎమ్మెల్యే నాగరాజు.. సంబంధిత శాఖ అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దీంతో అధికారులు వెంటనే అక్కడికి వెళ్లి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. మోటార్ చెడిపోవడంతో నీరు రావడం లేదని అధికారులకు స్థానికులు తెలిపారు. అనంతరం సమస్యను అధికారులు పరిష్కరించారు. సమస్య పరిష్కారానికి కృషి చేసిన ఎమ్మెల్యే నాగరాజును స్థానికులు సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆత్మకూరు మార్కెట్ వైస్ చైర్మన్ తంగళ్లపల్లి తిరుపతి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, 66వ డివిజన్ అధ్యక్షుడు కనపర్తి కిరణ్, ఆరెపల్లి వెంకటస్వామి, రుద్రారపు అనిల్, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ వీసం సురేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

### మోషన్ టాలెంట్ టెస్ట్‌కు స్పందన



కాజీపేట అర్బన్: మోషన్ ఐఐటీ నీట్ ఇన్‌స్టిట్యూట్ హనుమకొండ బ్రాంచ్‌లో ఆదివారం నిర్వహించిన టాలెంట్ టెస్ట్‌కు స్పందన లభించిందని కళాశాల చైర్మన్ వేణుగోపాల్ గౌడ్ తెలిపారు. ఐఐటీ, మెడికల్ కోచింగ్‌కు దేశంలోని అగ్రగామి సంస్థగా పేరుగాంచిన మోషన్ కాలేజీ టాలెంట్ టెస్ట్‌కు సుమారు 800 మంది విద్యార్థులు హాజరైనట్లు వివరించారు.

### శతాధిక వృద్ధురాలి మృతి



కొమురమ్మ (ఫైల్)

కాజీపేట: కాజీపేట 62వ డివిజన్ సోమిడి గ్రామంలో శతాధిక వృద్ధురాలు కాయిత పెద్దగొల్ల కొమురమ్మ (110) ఆదివారం తెల్లవారుజామున మృతి చెందారు. ఐదేళ్ల క్రితం కొమురమ్మకు పాలపండ్లు వచ్చాయి. మృతురాలికి నలుగురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. అయిదు తరాలకు చెందిన మునిమనుమలు, మనుమరాళ్లను చూసింది. కొద్దిరోజులుగా అస్వస్థతకు గురైన కొమురమ్మ ఆదివారం మృతి చెందారు. బాధిత కుటుంబ సభ్యులను కార్పొరేటర్ జక్కుల రవీందర్ యాదవ్, నాయకురాలు జక్కుల రజిత, జిల్లా గొర్రెల కాపరుల సంఘం మాజీ చైర్మన్ మేకల కేదారి యాదవ్, కాయిత రాజ్‌కుమార్ యాదవ్, శ్రావణ్ యాదవ్, స్థానికులు, తదితరులు పరామర్శించారు.

# జనావాసాల్లో అపరిశుభ్రత



కాలనీలోని ఖాళీ స్థలంలో పెరిగిన పిచ్చిమొక్కలు



అడవిని తలపిస్తున్న ముళ్లపొదలు

## ఖాళీ స్థలాల్లో మురుగు, చెత్తాచెదారం

- రెండు డివిజన్ల మధ్యలోని కాలనీవాసుల వ్యథ
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

వరంగల్: వరంగల్ లక్ష్మీగణపతి కాలనీ బాక్స్ డ్రెయినేజీని ఆనుకుని 14, 19వ డివిజన్ల మధ్య ఉన్న కాలనీలోని ఖాళీ స్థలాల్లో నుంచి ఇళ్లల్లోకి పాములు వస్తున్నాయని స్థానికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. కాలనీలో ఉన్న ఆరు ఖాళీ స్థలాల్లో పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగాయి. చెత్తాచెదారం పోగైంది. దాంతో పాముల సంచారం ఎక్కువైంది. విషపురుగుల భయంతో స్థానికులు వణికిపోతున్నారు. తమ వీధి.. ఒకవైపు 14వ డివిజన్, మరోవైపు 19వ డివిజన్ పరిధిలోకి వస్తోంది. దాంతో సమస్యలు ఎవరికి చెప్పాలో అర్థం కావడం లేదని ప్రజలు చెబుతున్నారు. సమస్యలను కార్పొరేటర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ల దృష్టికి తీసుకుపోయినా వారు పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఖాళీ స్థలాల యజమానులకు అధికారులు నోటీసులు జారీచేసి అందులోని చెత్తను తొలగించాలని కోరుతున్నారు.

### పాములు వస్తున్నాయి..



వీధిలోని రోడ్లపై పాములు స్వైర విహారం చేస్తున్నాయి. పక్కనే ఉన్న ఖాళీ స్థలాల నుంచి బయటకు వస్తున్నాయి. ఇళ్లలోకి వస్తాయో అన్న భయంతో బతుకుతున్నాం. పిచ్చిమొక్కలు, చెత్తాచెదారాన్ని తొలగించాలి.

- గంగుల రమాదేవి, గృహిణి

### వీధిలైట్లు వెలగడం లేదు



కాలనీలో వీధి లైట్లు సరిగా వెలగడం లేదు. ఉన్న 8లైట్లలో 3 లైట్లు 15నెల రోజులుగా వెలగడం లేదు. మా కాలనీ.. ఒక పక్క 14వ డివిజన్, మరోపక్క 19వ డివిజన్‌లోకి వస్తుంది. దాంతో ఇద్దరు కార్పొరేటర్లూ పట్టించుకోవడం లేదు.

- కంది లక్ష్మి, కాలనీ వాసి

## ఇళ్ల మధ్య మురుగునీరు

- ఫిర్యాదు చేసినా స్పందన కరువు
- గ్రీవెన్స్‌లో దరఖాస్తుల బుట్టదాఖలు
- ఆందోళన వ్యక్తం చేస్తున్న కాలనీవాసులు





ఇళ్ల మధ్య నిలిచిన మురుగునీరు

హసన్‌పర్తి: జనావాల్లో మురుగునీటితో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మురుగు కాల్వలు లేకపోవడం ఖాళీ స్థలాల్లో మురుగు నిలుస్తోంది. ఈక్రమంలో దోమలు, విష పురుగుల బెడదతో ప్రజలు అనేక ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. ఈ విషయమై కాలనీ కమిటీ సభ్యులు గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. ఇప్పటికి నాలుగు సార్లు విన్నవించినా అధికారులు స్పందించడం కాలనీవాసులు వాపోతున్నారు. 56వ డివిజన్‌లోని వివేక్‌నగర్ కాలనీలో మురుగునీటి కాల్వల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో ఇళ్ల నుంచి వస్తున్న మురుగునీరు ఖాళీ స్థలాల్లోకి చేరుతోంది. ఫలితంగా దుర్వాసన వెదజల్లడమే కాకుండా దోమల వ్యాప్తితో కంటిమీద కునుకు లేకుండా పోతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై శానిటరీ ఇన్‌స్పెక్టర్ దృష్టికి తీసుకెళ్లినా స్పందించలేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### అధికారులు స్పందించడం లేదు



వివేక్‌నగర్ కాలనీలో మురుగునీటి కాల్వల వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది. ఈవిషయమై గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేసినా అధికారులు స్పందించడం లేదు. ఉన్నతాధికారులు చొరవ చూపి సమస్యకు పరిష్కారం చూపాలి.

- దశరథం, ప్రజాతంత్ర ఆలోచన వేదిక వ్యవస్థాపకుడు

### విషజ్వరాలతో బాధపడుతున్నాం



ఖాళీ స్థలాల్లో మురుగునీరు నిల్వడం వల్ల దుర్వాసనతో జ్వరాల బారిన పడుతున్నాం. గ్రీవెన్స్‌ల్లో ఫిర్యాదు చేసినా, స్థానిక అధికారులకు ఫోన్ చెప్పినా స్పందన లేదు. ఈ విషయమై కమిషనర్ సత్వరమే స్పందించాలి.

- మీసాల రమేష్, కాలనీ అసోసియేట్ అధ్యక్షుడు

## మహిళా రిజర్వేషన్ అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న జ్యోతి

ఖిలా వరంగల్: మహిళా రిజర్వేషన్‌ను తక్షణమే అమలు చేయాలని భారత జాతీయ మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నేదునూరి జ్యోతి డిమాండ్ చేశారు. ఈమేరకు వరంగల్ బొల్లికుంటలో చిట్యాల సువర్ణ అధ్యక్షతన భారత జాతీయ సమాఖ్య మండల సమావేశం ఆదివారం జరిగింది. ముఖ్యఅతిథిగా ఆమె మాట్లాడుతూ కేంద్రం డీలిమిటేషన్ పేరుతో మహిళా రిజర్వేషన్లను వాయిదా వేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. దేశాభివృద్ధిలో మహిళలను భాగస్వాములుగా చేయాలంటే, రాజ్యాంగ లౌకిక వ్యవస్థను పరిరక్షించాలంటే మహిళా శక్తి సామర్థ్యాలను వినియోగించుకోవాలని సూచించారు. సమావేశంలో సమాఖ్య జిల్లా ప్రతినిధులు రహేలా, సుంకరి భవాని, వనం సౌందర్య, ఉమ, నవాంబీ, తిరుపతమ్మ, గౌతమి, రాజేశ్వరి, దివ్య తదితరులు పాల్గొన్నారు.

## ఆర్థికంగా మహిళలు ఎదిగితేనే కుటుంబాల్లో ఆనందం



సభ్యులకు బంగారం అందజేస్తున్న బాధ్యులు

వరంగల్: మహిళలు ఆర్థికంగా ఎదిగితేనే ఆ కుటుంబాల్లో ఆనందం వెల్లివిరుస్తుందని ఏనుమాముల మున్నూరుకాపు కుల సేవా సంఘం అధ్యక్షుడు గంద్రతి భాస్కర్ అన్నారు. సంఘం 16వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆరో మహాసభను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధ్య తరగతి కుటుంబాలు సంఘాలతో ఆర్థికంగా బలోపేతం అవుతాయని తెలిపారు. సంఘ సభ్యులంతా సంఘం అభివృద్ధికి తోడ్పాటు అందించాలని కోరారు. సంఘంలోని 323 మంది సభ్యులకు పావు తులం బంగారం అందజేసినట్లు తెలిపారు. అనంతరం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడిగా గంద్రతి భాస్కర్, ప్రధాన కార్యదర్శిగా గంద్రతి నవీన్, కోశాధికారిగా యనమందల కృష్ణ, ఉపాధ్యక్షులుగా కోమండ్ల రాజు, నీలం శ్రీను, సహాయ కార్యదర్శి నిడిగొండ శ్యామ్, కమిటీ సభ్యులు వెంకటేశ్వర్లు, రవి, కె.రాంచందర్, వీరభద్రయ్య, ఆర్.చంద్రశేఖర్, అల్లం రాజు, స్వామి, సతీష్ ఎన్నికయ్యారు.

## సభ్యుల సంక్షేమానికి సంఘాలు దోహదం



సమావేశంలో మాట్లాడుతున్న కుమారస్వామి

ఖిలా వరంగల్: సభ్యుల సంక్షేమానికి పరపతి సంఘాలు ఎంతగానో దోహదపడుతాయని మున్నూరుకాపు పరపతి సంఘం అధ్యక్షుడు బండి కుమారస్వామి, ఒగిలిశెట్టి అనిల్‌కుమార్ అన్నారు. వరంగల్ కరీమాబాద్‌లోని సంఘ భవనంలో కోశాధికారి బండి మోహన్, కొమ్మిని రాజేందర్ అధ్యక్షతన 23వ వార్షికోత్సవం, సర్వసభ్య సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా వారు హాజరై మాట్లాడుతూ సంఘం అభివృద్ధితోపాటు సభ్యులు ఆర్థికంగా ఎదిగేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం కోశాధికారి వార్షిక లావాదేవీలను వివరించగా సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు.

## ఘనంగా వాగ్దేవి సిల్వర్ జూబ్లీ వేడుకలు



వేడుకలను ప్రారంభిస్తున్న డాక్టర్ సంధ్య

కాజీపేట అర్బన్: వాగ్దేవి కాలేజ్ ఆఫ్ ఫిజియోథెరపీ సిల్వర్ జూబ్లీ వేడుకలను కళాశాల ఆవరణలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. కాళోజీ నారాయణ హెల్త్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ సంధ్య ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతిప్రజ్వలన చేసి సిల్వర్ జూబ్లీ వేడుకలను ప్రారంభించి మాట్లాడారు. ఫిజియోథెరపీ తమ దైనందిక జీవితంలో ఓ భాగం అయిందని, ఫిజియోథెరపీలో రీసెర్చ్ ఎంతో ప్రాముఖ్యమైనదని వివరించారు. వెన్నుముక వంకరగా ఉన్నప్పుడు ప్రాత్ అనే పద్ధతి ఎంతో ఫలితాన్ని ఇస్తుందని తెలిపారు. వెన్నునొప్పి నివారణపై సింగపూర్‌కు చెందిన ఫిజియోథెరపీ వైద్యురాలు అలెక్యాండా లిచ్చి, శ్రీలంకలోని పెరిండియార్ యూనివర్సిటీ వైద్యులు వయూరస్, ఉజ్వల్ భట్టాచార్య, అమ్రిత్ బిశ్వాస్, భాస్కర్‌రెడ్డి, థాయిలాండ్‌కు చెందిన సిరిచాన్ అవగాహన కల్పించారు. ఫిజియోథెరపీ ఆవశ్యకతపై కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ దేవేందర్‌రెడ్డి, డైరెక్టర్ డాక్టర్ వాహిని, ప్రిన్సిపాల్ డాక్టర్ సంపత్‌రెడ్డి ప్రసంగించారు. సిల్వర్‌జూబ్లీ సందర్భంగా ఫిజియోథెరపీలో విశిష్ట ప్రతిభ కనబరిచిన పలువురికి ప్రొఫెషనల్ ఎక్సలెన్స్ అవార్డులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో కన్వీనర్ డాక్టర్ చిరంజీవి, రాజమహేంద్ర, సాయికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి

పరకాల: కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమం కోసం నిరంతరం శ్రమిస్తోందని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. పరకాల వ్యవసాయ మార్కెట్ యార్డులో ఆదివారం పరకాల పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే రేవూరి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు రైతులకు కాంగ్రెస్ ఇచ్చిన ప్రతీ హామీని నిలబెట్టుకోనున్నట్లు తెలిపారు. రైతు రాజ్యం రావాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కోరుకుంటున్నారని చెప్పారు. మార్కెట్‌కు చేరుకునే రైతు సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ చైర్మన్ చందుపట్ల రాజిరెడ్డి, పరకాల పీఏసీఎస్ చైర్మన్ చందుపట్ల రాజేందర్‌రెడ్డి, మార్కెట్ వైస్ చైర్మన్ మారెపల్లి రవీందర్, మార్కెట్ డైరెక్టర్లు, పీఏసీఎస్ డైరెక్టర్లు, నాయకులు పాల్గొన్నారు.

### ఎంబీబీఎస్ విద్యార్థులకు సన్మానం



విద్యారణ్యపురి: ఎంబీబీఎస్‌లో సీట్లు సాధించిన ఇద్దరు విద్యార్థులను హనుమకొండలో తన నివాసంలో వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు ఆదివారం అభినందించారు. శ్రీవైష్ణవి, బిజిలి సిద్ధార్థకు వైద్య విద్య పరికరాలు అందించి అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎంబీబీఎస్ వైద్యవిద్య పూర్తయ్యేంత వరకు తనవంతు సహాయ సహకారం అందిస్తానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో షెడ్యూల్డ్ కులాల అధ్యయన కేంద్రం ఉమ్మడి వరంగల్ జిల్లా సంచాలకులు డాక్టర్ జగన్మోహన్, కేయూ రిటైర్డ్ ప్రొఫెసర్ బన్న అయిలయ్య, వర్ధన్నపేట పాక్స్ చైర్మన్ రాజేష్‌ఖన్నా, సకినేని మహబూబియా, సుధాకర్, డాక్టర్ దుర్గాప్రసాద్, నాయకులు రాయపుం సాంబయ్య, కందుకూరి పూర్ణచందర్, ప్రశాంత్‌గౌడ్ పాల్గొన్నారు.

### ఉద్యోగులకు అభినందన



హసన్‌పర్తి: ఇటీవల డీఎస్సీ ద్వారా హసన్‌పర్తి మండలం సీతంపేట గ్రామానికి చెందిన ఏడుగురు ఉపాధ్యాయులుగా ఎంపికకాగా, మరో ముగ్గురు జూనియర్ లెక్చరర్లుగా ఎంపికయ్యారు. ఒకేసారి పది మంది ఉద్యోగాలు సాధించడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ఈమేరకు హెప్సిబా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వారిని ఆదివారం సన్మానించారు. ఈ సందర్భంగా హెప్సిబా చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు గిన్నారపు సదానందం మాట్లాడుతూ సీతంపేటకు చెందిన పదిమంది ఉద్యోగాలు సాధించడం అభినందనీయమని కొనియాడారు. వారిని విద్యార్థులు ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నద్దునూరి చేరాలు, చిర్ర స్వప్న, ఉపాధ్యాయులు సూర రవీందర్, రిటైర్డ్ ఉపాధ్యాయులు రాజిరెడ్డి, రాజ్‌మహ్మద్, రాజయ్య, బాబు, గిన్నారపు పాల్, తదితరులు పాల్గొన్నారు.

### గజాణన కమిటీ సభ్యులకు సన్మానం



హనుమకొండ అర్బన్: గణపతి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ప్రథమ బహుమతి పొందిన గజాణన కమిటీ అధ్యక్షుడు గుత్తికొండ నారాయణ, కార్యదర్శి కటంగూరి రాంగోపాల్‌రెడ్డి, కోశాధికారి కోదాటి సుమన్ రావును టీఎన్‌జీవోస్ కాలనీ ఫేజ్ -2 లో ఆదివారం సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాలనీ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు లక్కిరెడ్డి, శ్రీధర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి బానోతు దేవీసింగ్, తదితరులు పాల్గొన్నారు.

## అదృశ్యమైన బాలికల అప్పగింత

దేశాయిపేట: దేశాయిపేట రోడ్డులోని నూర్ ఈ పుర్కాన్ అనే మదర్సా నుంచి ఇద్దరు బాలికలు (అక్కచెల్లెళ్లు) అదృశ్యమైనట్లు వారి తల్లి కౌసర్ ఫిర్యాదు చేసినట్లు ఇంతేజార్‌గంజ్ పోలీసులు తెలిపారు. నగరానికి చెందిన కరీమాబాద్ బీరన్నకుంటకు చెందిన కౌసర్, మసూద్‌కు ఇద్దరు కుమార్తెలు సానియా (13), సనా(10) నూర్ ఈ పుర్కాన్ మదర్సాలో ఉంటున్నారు. శనివారం ఉదయం బయటకు వెళ్లిన అక్కాచెల్లెళ్లు మళ్లీ మదర్సాకు తిరిగి రాలేదు. ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఇంతేజార్‌గంజ్ ఇన్‌స్పెక్టర్ షుకూర్ తెలిపారు.

ఎంజీఎం: సానియా, సనాను మట్టెవాడ పోలీసులకు ఎస్పీఎఫ్ పోలీసులు ఆదివారం రాత్రి అప్పగించారు. ఎంజీఎం ఆస్పత్రిలో ఎస్పీఎఫ్ ఏఎస్సై ఆదినారాయణ, హెడ్ కానిస్టేబుల్ రవి, కానిస్టేబుల్ విజయ్ ఆస్పత్రిలో పెట్రోలింగ్ చేస్తుండగా బాలికలు అనుమానాస్పదంగా సంచరిస్తుండగా వారిని విచారించి తప్పిపోయినట్లుగా గుర్తించి మట్టెవాడ పోలీసులకు అప్పగించారు.

## నరకాసుర వధకు బందోబస్తు

- రంగలీల మైదానంలో ఏర్పాట్ల పరిశీలన



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఏసీపీ, కమిటీ సభ్యులు

ఖిలా వరంగల్: దీపావళి సందర్భంగా ఉర్సుగుట్ట రంగలీల మైదానంలో ఈనెల 30న నిర్వహించనున్న నరకాసుర వధకు పోలీసు బందోబస్తు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని ఏసీపీ నందిరాం నాయక్ తెలిపారు. ఈమేరకు రంగలీల మైదానంలో జరుగుతున్న ఏర్పాట్లను ఇన్‌స్పెక్టర్ జూపల్లి వెంకటరత్నం, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు మరుపల్లి రవి, సభ్యులతో కలిసి ఏసీపీ ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా నందిరాంనాయక్ మాట్లాడుతూ ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని, వేర్వేరుగా పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఇబ్బందులు కలుగకుండా భారీగేట్లు ఏర్పాటు చేయాలని కమిటీ సభ్యులకు ఏసీపీ సూచించారు. కార్యక్రమంలో శ్యామలరావు, కనుకుంట్ల రవి, గౌతమ్, గౌడ రామ్, దాసరి రాజు, తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కార్మికులకు అవకాశం కల్పించాలి



నినాదాలు చేస్తున్న నాయకులు, కార్మికులు

కాజీపేట అర్బన్: మున్సిపల్ కాంట్రాక్టర్ మోసానికి బలైన బాధిత కార్మికులకు త్వరలో భర్తీ చేయనున్న 250 పోస్టుల్లో అవకాశం కల్పించాలని సీఐటీయూ మున్సిపల్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బరుపట్ల మహేష్, ఉప్పలయ్య డిమాండ్ చేశారు. ఈమేరకు హనుమకొండ ఏకశిల పార్కు ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ఆదివారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల 550 మందికి అవకాశం కల్పిస్తామని డబ్బులు దండుకున్న సదరు కాంట్రాక్టర్.. 452 మందికి మాత్రమే అవకాశం కల్పించి చేతులు దులుపుకున్నాడని విమర్శించారు. మిగతా వారికి డబ్బులు కూడా తిరిగి ఇవ్వలేదని పేర్కొన్నారు. త్వరలో భర్తీ చేయనున్న నియామకాల్లో బాధితులకు అవకాశం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

## కొవ్వొత్తులతో టీజీఎస్పీ కానిస్టేబుళ్ల నిరసన



బెటాలియన్ ప్రాంగణంలో కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న టీజీఎస్పీ కానిస్టేబుళ్లు

ఖిలా వరంగల్: ఏక్ పోలీస్ విధానాన్ని తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ మామునూరు టీజీఎస్పీ నాలుగో బెటాలియన్ ప్రాంగణంలో సిబ్బంది ఆదివారం రాత్రి కొవ్వొత్తులతో నిరసన తెలిపారు. కానిస్టేబుళ్ల సస్పెన్షన్‌ను రద్దు చేసి తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ శాంతిర్యాలీ చేపట్టినట్లు టీజీఎస్పీ పోలీసులు తెలిపారు. అధికారులు స్పందించాలని కోరారు.

## రక్తదానం ప్రాణదానంతో సమానం



రక్తదానం చేస్తున్న పరివార్ యోగా సాధకులు

కాశిబుగ్గ: రక్తదానం ప్రాణదానంతో సమానమని శ్రీపరివార్ ఆధ్యాత్మిక స్వచ్ఛంద సేవా సంస్థ ట్రస్ట్ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ రాజేంద్రప్రసాద్, డాక్టర్ తిరుపతి అన్నారు. ఓసిటీలోని బీరన్న దేవాలయంలో సేవా సంస్థ ఆధ్వర్యంలో యోగా సాధకులు ఆదివారం రక్తదానం శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేంద్రప్రసాద్, తిరుపతి మాట్లాడుతూ ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతతతోపాటు ఆరోగ్యంగా ఉండవచ్చని తెలిపారు. ప్రతిఒక్కరూ యోగా సాధన చేయాలని సూచించారు. శిబిరంలో 50 యూనిట్ల రక్తం సేకరించినట్లు నిర్వాహకులు వివరించారు. కార్యక్రమంలో యోగా సాధకులు కంచ సంపత్, అల్లె సంపత్, పూజిత పాల్గొన్నారు.